క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం

ఏలేశ్వరం: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి కాటం భాను అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి భాను మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకుని విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. బాలికల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ పుల్లయ్య, న్యాయవాదులు మూది నారాయణస్వామి, అవసరాల దేవి, ఆకుల హరిబాబు, వేగి భద్రం, జాన్‌బాబు, ప్రిన్సిపాల్ చంద్రశారద, కోరాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

తుని: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రజారోగ్యశాఖ అధికారి జీవీఆర్ శేఖర్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ఆదేశాల మేరకు శనివారం స్థానిక 20వ వార్డులో ప్రజలకు డెంగీ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్ల మధ్య నీటి తొట్టెలు, ప్లాస్టిక్ డబ్బాల్లో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. పారిశుధ్యం విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలని కోరారు. కౌన్సిలర్ రాసబోయిన జీవరత్నం, శానిటేషన్ కార్యదర్శి సుష్మిత, వలంటీర్లు పాల్గొన్నారు.

బైక్ దహనం

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో శుక్రవారం అర్ధరాత్రి మోటారు బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్న దొడ్డి శ్రీనివాస్ తన ఇంటి ముందు రాత్రి బైక్ పార్కింగ్ చేశాడు. ఉదయం లేచి చూడగా బైక్ దగ్ధమై ఉంది. దీనిపై పోలీసులకు సమాచారం అందింది.

ఉచిత రక్తదాన శిబిరం

ఏలేశ్వరం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శనివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు గట్టెం వెంకటరమణ ఆధ్వర్యంలో పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి లోవరాజు, వాడపల్లి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.10 లక్షలు

- మంజూరు చేయించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- బాధిత కుటుంబానికి తక్షణ సాయం అందచేత

జగ్గంపేట: మండలంలోని సీతారాపురంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కిల్లి నాగేశ్వరరావు కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసిందని మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా తెలిపారు. జగ్గంపేటలో శనివారం రాత్రి నాగేశ్వరరావు మృతదేహానికి ఆయన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచన మేరకు ఆర్థిక సాయం అందచేశారు. అనంతరం బండారు రాజా మాట్లాడుతూ సీతారాపురం విద్యుత్ షాక్ సంఘటనపై ఎమ్మెల్యే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ఈ విషయాన్ని తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.5 లక్షలు, విద్యుత్ శాఖ ద్వారా మరో రూ.5 లక్షలు మంజూరు చేయించారన్నారు. ఈ విషయాన్ని బాధిత కుటుంబానికి తెలియచేసి మనోధైర్యం కల్పించమన్నారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, పంచాయతీ మెంబర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.



మృతుడు నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఎస్‌ఈబీ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలోని మాసంపల్లి అటవీ ప్రాంతంలో శనివారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. శంఖవరం మండలం మాసంపల్లి అటవీ ప్రాంతంలో సారా స్థావరాలపై ఇంటిలిజెన్స్, టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. జగన్నాథపురం శివారు మాసంపల్లి గిరిజన తండాకు చెందిన వెలుగుల శ్రీను, పూసల ఏసుబాబులపై కేసులు నమోదు చేశారు. సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సంఘటన స్థలాల నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఇంటిలిజెన్స్ వింగ్ సీఐ కె.గిరిధర్, కాకినాడ ఎస్‌ఈబీ సీఐ పి.సునీల్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై జె.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సత్యగణపతిగా స్వామివారు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం వినాయకుడు సత్యగణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు గణపతికి పుష్పాలు, గరికతో పూజలు చేశారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం

ప్రత్తిపాడు రూరల్: గణపతి నవరాత్రుల ముగింపులో భాగంగా శనివారం గణేశ్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, ఉత్తరకంచి, పెద్దిపాలెం, శరభవరం, చింతలూరు గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాలు జరిగాయి. గణపతిని తీన్‌మార్, బాణసంచా కాల్పుల నడుమ గ్రామాల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు.

బవాజీపేటలో హిందూ ధర్మ ప్రచారం

గోకవరం: మండలంలోని బావాజీపేటలో శనివారం హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. సనాతన ధర్మ ప్రచార వాగ్గేయకార సంకీర్తన వాహిని సేవా సమితి ఆధ్వర్యంలో హిందూ ధర్మంపై ఇంటింటా ప్రచారం చేశారు. తొలుత గ్రామస్తులు, మహిళలు ప్రచార రథానికి గోవింద నామ స్మరణ చేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. రాత్రి ఆలయం వద్ద ప్రచార రథం ప్రెసిడెంట్ కరటూరి వెంకట శ్రీనివాస్‌రావు బృందం సభ్యులు అన్నమయ్య సంకీర్తన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

కనకదుర్గ అమ్మవారికి చండీహోమం

అన్నవరం: రత్నగిరి తొలి పావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం 'మూల' సందర్భంగా శనివారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. నలుగురు భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అల్లిపూడిలో 'పొలంబడి'

కోటనందూరు: మండలంలోని అల్లిపూడిలో శనివారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఖరీఫ్ వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంపై రైతులకు మండల ఏఓ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. పొటాష్ వినియోగంతో పంటకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం రైతులు, వీపీఏలతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం పంటపై పురుగులు, తెగుళ్ల ప్రభావం పెద్దగా లేదని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

తుని: స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తారకేశ్వరి తెలిపారు. కాకినాడ ఐడియల్ కళాశాల మైదానంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తుని జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు కబడ్డీలో నలుగురు, ఖోఖోలో ముగ్గురు, హ్యాండ్ బాల్‌లో ముగ్గురు ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో వాసవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వాసవి సుధ ఆగ్రో ఫుడ్స్ (జీడిపిక్కల ఫ్యాక్టరీ) ఆవరణలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విజయ నగరానికి చెందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు రోగులను పరీక్షించారు. 40 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కంటిలో శుక్లాలు ఉన్న 16 మందిని గుర్తించి శస్త్రచికిత్స కోసం విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించినట్లు నిర్వాహకులు కుసుమంచి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, దాసరి నూకయ్యశెట్టి, సర్పంచులు టి.సత్యనారాయణ, డి.తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

అన్నవరం: గణపతి నవరాత్రుల్లో భాగంగా స్థానిక సాయిబాబా ఆలయం వద్ద గల శ్రీకృష్ణ దేవరాయ కాపు కల్యాణ మండపం వద్ద శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు తొండంగిలో...

తొండంగి: గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా స్థానిక సినిమా హాల్ సెంటర్‌లోని వినాయకుని ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు శనివారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11 గంటలకు అన్న సమారాధన ప్రారంభమవుతుందన్నారు. స్థానిక, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించాలని కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ

జగ్గంపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరిస్తూ జగ్గంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు.

అలరించిన జాతీయ బృందగాన పోటీలు

తుని: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బృందగాన పోటీలు అలరించాయి. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శనివారం హిందీ, తెలుగు, సంస్కృతం విభాగాల్లో బృందగాన పోటీలు నిర్వహించారు. భారత్ వికాస్ పరిషత్ తుని శాఖ అధ్యక్షుడు పీఎల్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో తుని, పరిసర ప్రాంతాలకు చెందిన 13 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. హిందీ విభాగంలో ప్రథమ స్థానం లయోలా, ద్వితీయ స్థానం శ్రీప్రకాష్, సంస్కృతంలో ప్రథమ స్థానం లయోలా, ద్వితీయ స్థానం తుని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, తెలుగులో ప్రథమ స్థానం శ్రీప్రకాష్, ద్వితీయ స్థానం లయోలా పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. పోటీల కన్వీనర్‌గా రామకృష్ణమ్మ, న్యాయ నిర్ణేతలుగా షేక్ అమీనా సాహెబ్, సత్యవేణి, కళ్యాణి వ్యవహరించారు. విజేతలకు భారత్ వికాస్ పరిషత్ తుని శాఖ గౌరవాధ్యక్షుడు ఎంపీ సూర్యనారాయణరాజు బహుమతులు అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు చదరం శివాజీ, గాజుల వేణుగోపాలస్వామి, నాగేశ్వరరావు, శివకుమార్, ప్రసాద్, జోసెఫ్, వెంకటేశ్వర్లు, ఆంజనేయ ప్రసాద్, అమల రాజు పాల్గొన్నారు.



బృందగాన పోటీల్లో విజేతలతో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తొండంగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో రెండో విడతగా ఒంటిమామిడికి చెందిన 22 మందికి కొత్తగా ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ నాయకుడు దడాల విజయబాబు, గ్రామసర్పంచ్ అంగుళూరి సుధాకర్‌తో కలిసి ఆయన ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మొదటి విడతలో ఒంటిమామిడిలో 110 మందికి ఇళ్లపట్టాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు కూడా మంజూరయ్యాయన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు పంచాయతీలో ఇంకా అర్హులైన 22 మందికి రెండో విడతలో పట్టాలు అందజేశామన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు అంగుళూరి సుశీల, దడాల విజయబాబు, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు బూర్తి కృష్ణ, పంచాయతీ సర్పంచ్ అంగుళూరి సుధాకర్, ఉపసర్పంచ్ గోసల కిషోర్, కొయ్యా హరిబాబు, పెద్దపూడి రమణ, కింతాడ పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

తుని: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 22వ వార్డు రామకృష్ణాకాలనీలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో పట్టణంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. టీడీపీ నాయకుల చెప్పుడు మాటలు నమ్మవద్దని ప్రజలకు హితువు పలికారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ అన్నవరం శ్రీను, కౌన్సిలర్ కోలా శ్రీను, పలువురు కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐప్వా మహాసభలను విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు: దేశ రాజధాని ఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగే అఖిల భారత ప్రగతి శీల మహిళా సంఘం (ఐప్వా) 9వ జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని కోరుతూ ఐప్వా కార్యకర్తలు శనివారం సాయంత్రం ప్రత్తిపాడులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయం వద్ద ర్యాలీని లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు జెండా ఊపి ప్రారంభించారు. మార్కెట్, మెయిన్‌రోడ్డు, అల్లూరి సీతారామ జంక్షన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ కొనసాగింది. ఢిల్లీలో ఈ నెల 30, అక్టోబర్ 1 తేదీల్లో జరిగే సభలను విజయవంతం చేయాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐప్వా నాయకులు మాసా రాజమణి, గొల్లపల్లి కామరాజు, కుంచే మణితల్లి, మొగిలి అపర్ణ, పల్లా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.